



దిన పత్రిక

# తొలి సమయం


వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 26 | ఆదివారం 26-01-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం

**రక్షణ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలుకోసం యత్నం**

**భారత్ , ఇండోనేసియా మధ్య పలు ఒప్పందాలు**



**న్యూఢిల్లీ,జనవరి25:** ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్ , ఇండోనేసియా నిర్ణయించాయి. ముఖ్యంగా రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలు జరిగేలా ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ప్రధాని మోదీ మధ్య జరిగిన సమావేశంలో ఒప్పందం కుదిరింది. సుబియాంతో మూడు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం దిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం సమావేశం ముగిసిన అనంతరం ఇరుదేశాల నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ఇండోనేసియా కీలక భాగస్వామి అని మోదీ వ్యాఖ్యానించారు. 10 సభ్యదేశాలు కలిగిన ఆసియాన్‌తో పాటు ఇండో పసిఫిక్ కూటమిలో ఇండోనేసియాకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సంబంధాలను నెరపేందుకు ఇరుదేశాలు అంగీకరించినట్లు తెలిపారు. ద్వైపాక్షిక విధానాలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల తయారీ రంగంలో భారత్, ఇండోనేసియా కలిసి పని చేయబోతున్నట్లు చెప్పారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనానౌకల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో సముద్ర రక్షణను బలోపేతం చేసే దిశగా ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. కృత్రిమమేధ, ఇంటర్నెట్, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ఇరుదేశాలు పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు ఇండోనేసియా కూడా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు సుబియాంతో అన్నారు. ఫిన్‌టెక్, ఏఐ, ఐవోటీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వంటి రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.



## నేటి నుంచే నాలుగు పథకాలకు శ్రీకారం

**గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్దిదారుల ఎంపిక**

**అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు..అనర్హులకు చోటు దక్కొద్దు**

**పథకాల అమలుపై అధికారులు, మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష**

**గ్రామానికో అధికారి చొప్పన పథకాల అమలుకు ఆదేశాలు**

హైదరాబాద్,జనవరి25(ఆర్ఎన్): గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్దిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ది చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలను తెలంగాణ సర్కార్ లాంఛనంగా ప్రారంభించనుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నాలుగు పథకాలకు ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పున గ్రామానికి నలుగురు మండలస్థాయి అధికారులను నియమించాలని తెలిపింది. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రంలోని మిగతా గ్రామాల్లో లబ్దిదారులకు పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మార్చి 31 లోపు నాలుగు పథకాలు వంద శాతం అమలు జరిగేలా చూడాలి.. నిజమైన లబ్దిదారులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగొద్దు.. అనర్హులకు లబ్ది చేకూరిస్తే అధికారులపై చర్యలు తప్పవని సర్కార్ హెచ్చరించింది. సంక్షేమ పథకాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల వెరిఫికేషన్ కోసం గ్రామసభలు నిర్వహించామని, ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి పథకాల ప్రారంభిస్తామన్నారు.

## లక్ష్యం దిశగా దేశం పయనం

**- ఈ గణతంత్రం మనకు ప్రత్యేకం**

**- విముక్తి ప్రదాతలను స్మరించుకునే సమయం - జాతికిచ్చిన సందేశంలో రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ,జనవరి25:** ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోందని ఆమె అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. 'అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన తరుణమిదని అన్నారు.. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకొన్నాం. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకున్నాం. ఈ ఏడాది కొత్త చట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చాం' అని రాష్ట్రపతి తెలిపారు.ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి మనకు స్వాతంత్య్రం వచ్చినప్పటికీ, 1950 జనవరి 26న భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చింది. మనం ఈరోజు స్వేచ్ఛగా బతుకుతున్నా మంటే స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుల చలవే. అయితే ఈ విషయం గురించి చాలా మందికి తెలియకపోవడం విచారకరం. అలాగే 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది... కాబట్టి ప్రతి ఏటా ఇదే రోజున రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని భావిస్తారు. ఇందులో కాస్త నిజం లేకపోలేదు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. లాహోర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల స్వాతంత్ర సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అప్పటి దాకా కేవలం రాజకీయ, ఆధ్యాత్మిక స్వాతంత్రం వస్తే చాలు, సంపూర్ణ అధికారం బ్రిటిష్ వారి చేతుల్లోనే ఉండి, దేశం సామంత రాజ్యంగా మిగిలిపోయినా ఫర్వాలేదనుకునేలా ఉన్న రాజకీయ నేతల వైఖరిని జలియన్‌వాలాబాగ్ ఉదంతం ఒక్కసారిగా కళ్లు తెరిపించింది. ఆనాడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించి పూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రకటన చేయించడంలో సఫలమయ్యారు. ఆ రోజునే స్వాతంత్ర దినోత్సవంగా పరిగణించాల్సిందని కాంగ్రెస్ పార్టీ కూడా దేశ ప్రజలకు పిలుపు ఇచ్చింది. జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం - 1935 రద్దయ్యింది. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను నియమించారు. రాజ్యాంగ రచనకు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలం పట్టింది. రాజ్యాంగ రచనకు మొత్తం రూ.64 లక్షలు ఖర్చయ్యింది. తొలి గణతంత్ర దినోత్సవం నాటికి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ భారత రాష్ట్రపతిగా ఉన్నారు. రాజ్యాంగం అమలైన తర్వాత ఆయన ప్రస్తుత పార్లమెంట్ దర్బార్ హాల్‌లో రాష్ట్రపతిగా ప్రమాణం చేశారు. ఐదు మైళ్ల పొడవున సాగిన పరేడ్ తర్వాత, ఆయన ఇర్విన్ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అప్పటినుంచి ప్రపంచ దేశాల కూటమిలో సంపూర్ణ స్వతంత్ర దేశంగా భారత్ చేరింది.

## 12మందికి పోలీస్ విశిష్ట సేవా మెడల్స్

**హైదరాబాద్,జనవరి25:** స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ యేటా రెండు సార్లు పోలీసు పతకాలను ప్రకటిస్తుందనే విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రిపబ్లిక్ దేను పురస్కరించుకుని తాజాగా పోలీసు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 942 మంది ఇలా గ్యాలంట్రీ/సర్వీసు పతకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం అవార్డుల జాబితాను ప్రకటించింది.

ఇందులో 746 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్), 101 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 95 మందికి మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ పతకాలను ప్రకటించింది. ఈ పతకాలలో తెలంగాణ నుంచి 12 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) మెడల్స్ దక్కాయి. అలాగే తెలంగాణ నుంచి పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మన్, ఎస్పీ మెట్టు మాణిక్ రాజ్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఇక ఏపీ నుంచి చీఫ్ హెడ్ వార్డర్ కడాలి అర్జున రావు, వార్డర్ ఉండ్రాజవరపు వీరవెంకట సత్యనారాయణకు కరెక్షనల్ సర్వీస్ విభాగంలో పోలీస్ విశిష్ట సేవా పతాలకు ఎంపికయ్యారు.

## ఆదివాసీల మనుగడకై సాగే పోరాటంలో భాగమే "చిరుమళ్ల సమ్మక్క సారక్క మహా జాతర"

**ఈ జాతర ద్వారా రాష్ట్రానికి, దేశానికి నిజమైన ఆదివాసీలు అంటే ఎవరో తెలుస్తుంది**

**ప్రజాపోరాటం, న్యాయపోరాటం రాజకీయపోరాటాలతో పాటుగా ఆదివాసీల సాంస్కృతిక పోరాటంతో ఆదివాసీల ఐక్యత , అభివృద్ధి సాధ్యమవుతుంది.**

**ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త, కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ**

ఈ నెల జనవరి 26 నుండి ఫిబ్రవరి 15 వరకు భద్రాద్రికొత్త గూడెం జిల్లా, కరకగూడెం మండలం, చిరుమళ్ళ గ్రామంలో సమ్మక్క సారక్క మహా జాతర 21 రోజుల ఉపవాస దీక్షలు జరుగనున్న సందర్భంగా తలపెట్టిన సమీక్షా సమావేశంలో కోయ పున్నెం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలుగా 9 ఆదివాసీ తెగలు తమ రాజ్యాంగ హక్కుల కోసం, తమ రిజర్వేషన్లు కొల్లగొడుతున్న వలస అక్రమ గిరిజనులపై ప్రజాపోరాటం, న్యాయపోరాటం, రాజకీయ పోరాటం చేస్తున్న విషయం అందరికి తెలిసిందే అన్నారు.



మిగతా 4లో...

## మళ్లీ మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు

**స్థానిక ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**వరంగల్,జనవరి25:**
స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందు వల్లే కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోస్తున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజా దర్బార్, గ్రామసభలు, ఇంటింటికీ తిరిగి మూడు విడుతలుగా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని, కానీ ఇప్పటివరకు ఒక్క లబ్ధిదారునికి కూడా న్యాయం జరుగలేదని విమర్శించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ప్రజలు ఆశలో ఉన్నారని చెప్పారు. వరంగల్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది కాలం పాటు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదని మండిపడ్డారు. గ్రామ సభలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని విమర్శించారు. మంత్రులు, ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాలకు పోయి నీతులు చెబుతున్నారని ఎద్దేవాచేశారు. దావోస్ పెట్టుబడులు శుద్ధ అబద్ధమని, రేవంత్ రెడ్డి మాటలన్నీ బోగస్ అని చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి రేవంత్ రెడ్డి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను అబద్ధపు మాటలతో మోసం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిమ్మిక్కులు చేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. పోలీసులు, అధికారులను కార్యకర్తలుగా వాడుకుంటు న్నారని చెప్పారు. ఇకనైనా హామీలన్నీ అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.



కరీంనగర్ కలెక్టర్‌పై మంత్రి పొంగులేటి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. చిల్లర మాటలు మాట్లాడే కాంగ్రెస్ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ప్రజల తిరుగుబాటు ఎలా ఉంటుందో కాంగ్రెస్‌కు తెలుస్తుందన్నారు. భూతిక దాడులు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అబద్ధపు మాటలు, కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నన్నపనేని నరేందర్ అన్నారు. కొండా సురేఖకు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులకే మళ్లీ కొబ్బరికాయలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామసభల్లో లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇస్తామన్న హామీలు ఒక్కటి కూడా నెరవేరడం లేదని చెప్పారు. వరంగల్‌లో ప్రజా పాలన కాదని, ప్రజా కంటక పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. పట్టణంలో కనీసం మంచినీటి సరఫరా కూడా సరిగ్గా చేయడం లేదంటూ మండిపడ్డారు.

# తెలంగాణా రాష్ట్ర సాధనలో కమ్యూనిస్ట్‌ల భూమిక గొప్పది


**కాంగ్రెస్ బలంగా ఉండడానికి కమ్యూనిస్ట్ పార్టీ యే కారణం..**

**ఇప్పటి పిల్లలకు పోరాట పటిమ లేకుంటే సమాజానికి ప్రమాదమే..**

**-మార్పు కోరే వారు లేకుంటే కమ్యూనిస్టులు ఉండరు.**


**పెద్ద చదువులు చదివి పేదోళ్ల కోసం తీగలసత్య నారాయణ రావు పనిచేశారు**

**ప్రభుత్వవిప్ డాక్టర్ రాంచంద్రు నాయక్**



**తొలి సమయం, మహబూబాబాద్ జనవరి 25:** తెలంగాణా రాష్ట్ర సాధన లో కమ్యూనిస్టుల భూమిక గొప్పది అన్నారుడోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం లోని మూడు కొట్ల సెంటర్ లో మాజీ శాసనసభ్యులు తీగల సత్యనారాయణ రావు విగ్రహావిష్కరణ సభ కు ముఖ్య అతిదిగా ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ మాట్లాడుతూ... ఆ రోజుల్లో ఉస్మానియా లో డిగ్రీ చదివి, నాగపూర్ లో లా చదివిన, తొలి తరం విద్యావంతుడు తీగల సత్యనారాయణ రావు అన్నారు ఆయన తన కోసం కుటుంబం కోసం కాకుండా బడుగు బలహీన పీడిత ప్రజల పక్షాన నాయకుడుగా ఎదిగి శాసనసభ్యులు అయ్యారు అన్నారు.ఆయన చేసిన త్యాగాల ఫలితంగా ఈరోజు వరకు కమ్యూనిస్ట్ పార్టీలు బలంగా ఉన్నాయి అన్నారు పంచవర్ష ప్రణాళిక, రోటి కపడా, మకన్,గరీబి హటావో లాంటి సంస్కరణ లి ఇవ్వన్నీ కమ్యూనిస్తుల సహకారం సమాలోచన తోనే కాంగ్రెస్ పార్టీ చేపట్టింది అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీల వలన నే కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు బలంగా ఉన్నది అన్నారు. మార్పు కోరే వారే కమ్యూనిస్టులు అన్నారు.వారు లేకుంటే కమ్యూనిస్ట్ లు ఉండరు అన్నారు, అనన్య త్యాగాలు బలిదానాలు, రక్త తర్పణ తో తెచ్చుకున్న తెలంగాణా లో ప్రజల అకాంక్షలకు విరుద్ధంగా కెసిఆర్ నియంత నిరంకుశ,పాలన సాగించారు.

అన్నారు.మొత్తం రాష్ట్రాన్ని నష్టాల ఊబి లోకి నెట్టేసి పోయాడని అన్నారు. కెసిఆర్ ఇంకా 20సంవత్సరాల వరకు ఉండే విదంగా రాజకీయ, విషపూరిత,స్వార్ధ వ్యూహాలు రచించు కున్నాడని అన్నారు కాంగ్రెస్ కమ్యూనిస్ట్ లు చేయి కలిపితేనే కెసిఆర్ ను ఇంటికి పంపించగాలిగాము అన్నారు, లేకుంటే సాధ్యం కాకపోయేది అన్నారు. మానుకోట ఎంపీ భలరాం నాయక్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల కుటుంబాల్లో ప్రజా స్వామిక వాతావరణం ఉంటుంది అన్నారు. భార్యా భర్తల్లో ఆధిపత్యధోరణి లేకుండా హాయ్ గా స్వచ్చగా పరస్పర గౌరవంగా జీవిస్తారు అన్నారు.. మహిళలకు 33 శాతం రిజెర్వేషన్ ప్రతిపాధన చేసింది మొదట సోనియాగాంధీ అన్నారు.మానుకోట శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మాట్లాడుతూ.. “కాంగ్రెస్ సిపిఐ జోడు ఎడ్లలా పనిచెయ్యాలి” శాసనసభ్యులు మురళీ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ కమ్యూనిస్ట్ లు జోడు ఎడ్ల లాగ ఒకరికి ఒకరు అన్నట్లు సహకారం చేసుకుంటూ మానుకోట అభివృద్ధి లో పాల్గొనాలి అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబ శివరావు, రాష్ట్ర నాయకులు చాడ వెంకట్ రెడ్డి, మునిసిపా లిటి చైర్మన్ డాక్టర్ రాంమోహన్ రెడ్డి, సిపిఐ కార్యవర్గ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, అజయ్ సారధి రెడ్డి విజయ్ సారధి రెడ్డి, విశవేశ్వర రావు,తీగల సత్యనారాయణరావు కుటుంబ సభ్యులు బిడ్డలు విజయ, అరుణ, రేణుక అల్లుడు కమలాకర్ రావు.తదితరులు పాల్గొన్నారు





# పరస్పర విమర్శలకే నేతల ప్రాధాన్యం

**హైదరాబాద్ :** ఎన్నికల్లో అన్ని అంశాలు పక్కకు పోతున్నాయి. దూషణల పర్వం విపరీతంగా ముందుకు పోతోంది. ఎంత ఎక్కువగా దూషిస్తే అంతగా పాపులారిటీ అన్న పంథాలో పార్టీలు, వాటి నేతలుముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి అవాంఛనీయ వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధాని మోడీ సైతం ఇదే పంథాలు సాగుతున్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పరస్పర దూషణలు చేసుకోవడంతోనే ప్రచారాన్ని హైటెల్ చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితి ఉంది. అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పదేపదే విమర్శలతో కాలం గడుపుతున్నారు. సవాళ్లు విసరుతున్నారు. నిజానికి ప్రజలకు ఇవన్నీ అవసరం లేదు. ఏం చేస్తారో చెప్పాలి. ఏం చేశామో చెప్పాలి. ఎపినే తీసుకుంటే..రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019-2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు. టిడిపి-జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి- సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటంపైనే దృష్టి సారించారు. మోడీ ముందు మోకరిల్లే రాజీకాయలకు పరిమితం అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించలేక పోతున్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. ఉమ్మడి ఎపిలో పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జీవితాంతం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన అందించారు. కానీ పదవీచ్యుడుతు కావడంతో ఆయన ప్రతిభ పోయింది. చంద్రబాబు హయాంలో కొంత అభివృద్ధి సాగింది. కానీ జగన్ పాలనలో విడివడ్డ ఎపి అప్పులకుప్పగా మారింది. తెలంగాణలో కెసిఆర్ అభివృద్ధి ముసుగేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేంద్రప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. మోడీ అధికారంలోకి వచ్చాక నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. ప్రణాళికా సంఘాన్ని తొలగించారు. కానీ రాష్ట్రాలకు చేయూతనిచ్చి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో కూడా అభివృద్ధి నినాదం వెనక్కి పోయింది. మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు. ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు.ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయం.త దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్‌టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి.

## మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన నగర మేయర్ సుధారాణి,**

**మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజీ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు**






**తొలి సమయం వరంగల్ జనవరి 25:** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయు) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం త్వరలో చేపట్టబోతున్న 2కే రన్ కార్యక్రమ ప్రచార పోస్టర్ ను శనివారం వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులకి అభినందనలు తెలియజేశారు. మరియు ఇట్టి 2కే రన్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జేయు స్టేట్ జనరల్ సెక్రటరీ తోకల అనిల్ కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ రావుల నరేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్ ప్రధాని కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, కార్యవర్గ సభ్యులు నీరుటి శ్రీహరి, నాగపూరి అవినాష్, అడుప అశోక్, కౌడగానీ మోహన్ రావు, కమలాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమస్యల సాధన కోసం కృషి చేయాలి

**పిడి ఉమాదేవి**




**తొలిసమయం, ఇల్లందు జనవరి 25** జిల్లాలో మహిళల సమస్యల సాధన కోసం కృషి చేయాలని డిఆర్డిఏ పిడి ఉమాదేవి పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి డిఆర్‌డిఏ కార్యాలయంలో భారతీయ మహిళా సమాఖ్య 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలివివాహాల నిర్మూలన, మహిళల సంక్షేమం అభివృద్ధికి పలు పథకాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగస్వాములు కావాలన్నారు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా వారి హక్కుల రక్షణకై పోరాడాలన్నారు.మహిళలను గ్రామప్రాంతాల్లో చైతన్యవంతులను చేయాల న్నారు. మహిళల పురోగతికి ప్రభుత్వం పక్షాన తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు పి కళావతమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కృష్ణవేణి, గీత, వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు భూమిక, శిరీష నాయకులు శ్రీదేవి, జ్యోతి, పద్మ, తాటిపాముల దేవమ్మ, నీలమ్మ, సీపులి దేవమ్మ, కల్పన, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## లంచాల అడ్డగా మారిన తెలంగాణ

**కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరిగిన అవినీతి**

**గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్,జనవరి25:** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ రాష్ట్రం లంచాల అడ్డాగా మారిందని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారులు లంచాలు తీసుకోవడంపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు రాజాసింగ్ ఒక వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం లంచాలకు అడ్డాగా మారిపోయింది. ఒకప్పుడు కానిస్టేబుల్, ఎస్ఐ, ఏసీపీ లంచాలు తీసుకోవాలంటే భయం ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లంచాల దందా పెరిగింది. కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు సంబంధించిన ఓ ఆడియో క్లిప్ వైరల్ అవుతోంది. ఆ ఇన్‌స్పెక్టర్ ఓ కేసులో 3 లక్షలు లంచం తీసుకున్నట్లు ఆ ఆడియోలో ఉంది. ఇన్‌స్పెక్టర్ బాత్రూంలో డబ్బులు పెట్టినట్లు బాధితుడు చెబుతున్నాడు. సీసీటీవీ ఫుటేజీ చెక్ చేయాలని బాధితుడు ఉన్నతాధికారులను వేడుకుంటున్నట్లు ఆడియోలో ఉందని రాజాసింగ్ తెలిపారు. ఇక తన నియోజకవర్గం గోషామహల్ పరిధిలోని షాహినాత్ గంజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఏ బాబు చౌహాన్.. ఒక కేసు నుంచి పేరు తీసేయాలంటే లక్షా యాభై వేలు అడిగిండు. డీల్ రూ. 50 వేలకు ÷నైల్ అయింది. బాధిత వ్యక్తి నుంచి రూ. 50 వేలు తీసుకుం టుండగా ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. ఈ ఏడాదిలో చాలా వరకు పోలీసులు లంచాలు తీసుకుంటూ అరెస్టు అవుతున్నారు. లంచం మాఫియాపై సీవీ ఆనంద్ దృష్టి పెట్టాలి. పోలీసు అధికారులు వారి ఛాంబర్‌లో కూడా సీసీ కెమెరాలు పెట్టాలని డీజీపీ, సీపీని కోరుతున్నాను.

# నేడే చిరుమళ్ళలో సమ్మక్క సారక్క మహా జాతర 21 రోజుల దీక్షలు

**ఆసియా ఖండంలో అతి పెద్ద జాతర సమ్మక్క సారక్క జాతరే స్ఫూర్తిగా, చిరుమళ్ళ లో రెండవ సమ్మక్క సారక్క మహాజాతరకు అంకురార్పణ**

**6 సంవత్సరాల నుండి ఏటికేటా ఇంతింతై వటుడింతై అన్నట్లుగా 3 రోజులపాటు జరిగే సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణానికి,**

**ఇంటి వేల్పుల సమ్మేళనానికి 5 రాష్ట్రాల నుండి సుమారు 50 వేల పైచిలుకు రానున్న ఆదివాసీ భక్తులు.**

**ఆదివాసీ 9 తెగల సమన్వయ కర్త , కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ**

ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహా జాతర సమ్మక్క సారక్క మేడారం జాతర, ఆ వీరవనితల మహిమాన్విత తల్లుల మూలాలు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కరకగూడెం మండలం చిరుమళ్ల గ్రామంలో ఉన్నాయి అనడానికి చారిత్రక ఆనవాళ్లున్నాయి. ఎదురు వణంలో పసిపాప రూపం లో సమ్మక్కదేవత చందా వంశీయులకు అదృష్ట వశాత్తు లభించింది అని చందా వంశీయులు స్పష్టపరుస్తున్నారు, ఆ తర్వాత కొన్ని అనివార్య పరిస్థితుల్లో నేటి మేడారం లో సమ్మక్క సారక్క మహాజాతరకు పునాదులు పడ్డాయి అంటున్నారు చందా వంశస్థులు. సమ్మక్క తల్లి పుట్టు గద్దె చిరుమళ్ళ లో రెండవ మహాజాతరకు చందా వంశీయులు నడుం కట్టారు. ఆదివాసీ సాంస్కృతిక సైరన్ ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ వివరాలను అనుసరించి..





**తొలి సమయం మహబూబాబాద్ ప్రధాన ప్రతినిధి జనవరి 25:** ఫిబ్రవరి 11 నుండి 15వ తారీకు వరకు జరుగ బోయే సమ్మక్క సారక్కల పుట్టు గద్దె చిరుమళ్లలో జరుగబోయే జాతరకు ముందు సమ్మక్క సారక్కల 21 రోజుల ఉపవాస దీక్షలు నేటినుండి 15 వ తారీకు వరకు జరుగనున్నాయి అనంతరం బుర్ధారం గుట్టలలో కొలువైవున్న శ్రీ జ్వాలా లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం అనంతరం 16వ తారీకున దీక్ష విరమణ ఉంటుంది అని తెలియచేసారు. 21 రోజుల పాటు సాగే నిష్ఠ గల దీక్ష సమ్మక్క సారక్క ల చిరుమళ్ళ గుడి ఆవరణమే దీక్ష భూమి గా కొనగుతోంది. 21 రోజులు గా జరిగే ఈ ఆదివాసీ దార్మిక క్రతువు గా పిలువబడే చిరుమళ్ళ లో జరిగే మహాజాతరకు , 2023 సం" లో సుమారు 50 వేల ఆదివాసీ భక్తులు చత్తీస్గడ్ మహారాష్ట్ర ఒరిస్సా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల నుండి ఆదివాసీ భక్తులు వచ్చారు అన్నారు. ఇప్పుడు ఆ సంఖ్య మరింత పెరుగుతుంది.ఏటికేటా ఈ జాతరకు భక్తులు పోటు ఎత్తుతున్నారు. కనుక చిరుమళ్ల లో జరిగే ఈ జాతరకు వేల వేల అదివాసి భక్తులతో ఆదివాసి సమ్మేళనం, అత్యంత ధార్మికతను సంతరించుకుంటోంది. 124 కోయతుర్రారు వేల్పుల సమ్మేళణ పాదదూళితో అడవి బిడ్డల పండుగ సంబురాలు అంబురాన్ని అంటనున్నాయి. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో అతి పెద్ద జాతరగా చిరుమళ్ల సమ్మక్క సారక్క జాతర నాంది పలుకుతుంది. ఈ మహా జాతరతో చిరుమళ్ళ క్షేత్రం ఆదివాసీ ఆధ్యాత్మిక కేంద్రంగా పురుడు పోసుకుంటుంది అని కోయ పున్నెం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ తొలి సమయం ప్రతినిధితో తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.





# విజయసాయికి తత్వం బోధపడిందేమో

**- అయినా తప్పుచేసిన వారు తప్పించుకోలేరు**

**- జువైనల్ హోమ్‌ను సందర్శించిన అనిత - పిల్లల సంరక్షణలో బాధ్యతగా ఉన్నామని వెల్లడి**

**విశాఖపట్టణం,జనవరి25:** రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా, తప్పు చేసిన వాళ్లు శిక్ష అనుభవించాల్సిందేనని, విజయసాయిరెడ్డి రాజీనామాపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విజయసాయి రెడ్డికి కలలోకి గొడ్డలి వచ్చిందేమో, అందుకే భయపడి రాజీనామా చేసి ఉండొచ్చని హోంమంత్రి సెటైర్లు వేశారు. గత ఐదేళ్లలో దావోస్‌లో 4 సార్లు సమ్మిట్ జరిగితే ఒక్కసారి వెళ్ళొచ్చారని వంగలపూడి అనిత ఆరోపించారు. తిరనాళ్ళలో తప్పిపోయిన పిల్లాడి లాగా బిత్తర చూపులు చూస్తూ.. ఇట్స్ లెంగ్త్ క్వశ్చన్ అన్నారని పేర్కొన్నారు. మానసికంగా క్షోభ అనుభవిస్తున్న పిల్లలపై కూడా ప్రతిపక్షం రాజకీయం చేయడం తగదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తాము అమలు చేస్తే.. వైసీపీ వాళ్ళు ఈ 7 నెలలలో రోడ్ల మీదకి వచ్చే పరిస్థితి ఉండేది కాదని హోంమంత్రి అనిత తెలిపారు. విజయసాయి రెడ్డికి తత్వం బోధపడిందని ఆరోపించారు. విజయసాయి రెడ్డికి ఆయన చేసిన పాపాలు కలలో కూడా గుర్తు వస్తూ ఉన్నట్లు ఉన్నాయి.. ఆయన వ్యవసాయం చేస్తే పచ్చని ప్రకృతి కూడా కలుషితం అవుతుందని విమర్శించారు. విశాఖ నగరాన్ని నాశనం చేసిన వ్యక్తి విజయ సాయి రెడ్డి.. చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన కుటుంబాన్ని దూషించిన వ్యక్తి విజయసాయిరెడ్డి అని దుయ్యబట్టారు. ఆ తప్పుల నుంచి తప్పించుకోవడానికి ఆయన ప్రయత్నం చేస్తున్నారు.. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తెలిపారు.చిన్న పిల్లలపై రాజకీయాలు చేయొద్దని హోం మంత్రి అనిత అన్నారు. ప్రతిపక్షాలు తమపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. విశాఖ జువైనల్ హోమ్‌ను ఆమె పరిశీలించారు. రెండు రోజుల క్రితం సిబ్బంది తమను వేధిస్తున్నారని బాలికలు చేసిన ఆరోపణలపై ఇప్పటికే ఆమె నివేదిక కోరారు. వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విశాఖ బాలికల సదన్‌లో మొత్తం 56 మంది బాలికలు ఉన్నారని మంత్రి చెప్పారు. వాళ్లు చదువుతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కొంతమంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారని.. వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 'పిల్లలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిది. దీన్ని ఎవరో గుర్తుచేయాల్సిన అవసరం లేదు. మా బాధ్యత మాకు తెలుసు. సమస్య పరిష్కారం అయినా.. భవిష్యత్తులో ఎలాంటి సమస్య తిరిగి రాకూడదని ఈరోజు బాలికల సదన్‌ను సందర్శించాను. వైకాపా 'ఎక్స్' ఖాతాలో 80 శాతం అవాస్తవాలే. గత ఐదు సంవత్సరాలు అబద్దాలతో గడిపేశారు. ఇప్పుడు కూడా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. తప్పు చేసిన వాళ్లకు కచ్చితంగా శిక్ష పడుతుంది. ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచేశారు.' అని అనిత విమర్శించారు.

# ఉత్తమ తల్లిదండ్రులకు సన్మానం

**పాదాభివందనం**

**వినూత్న రీతిలో పిటీఎం సమావేశం**



**తొలిసమయం ఇల్లందు జనవరి 25:** సమాజంలో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఎం.జ్యోతిరాణి సూచించారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో ఈరోజు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన ఎజెండా ప్రకారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, పిల్లలకు ఆహార భద్రత ద్వారా మంచి ఆహారం అందించాల్సిన ఆవశ్యకతను గురించి, వారి ఎదుగుదల చర్యలు గురించి వివరించారు. విద్యార్థులు రూపొందించిన బోధనో ఉపకరణాలతో ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ తల్లిదండ్రులకు సన్మానాలు చేసి, విద్యార్థులతో పాదాభివందనం చేయించి మాతృదేవోభవ,పితృదేవోభవ, ఆచార్యదేవోభవ ఆవశ్యకతను తెలియజేశారు.విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఆశీర్వదించారు. ఉత్తమ తల్లులకు కిరీట ధారణ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పొగాకు లక్ష్మి, బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్. ఎం.మంగీలాల్ అతిథులుగా పాల్గొని ఉత్తమ తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. టీచర్లు జర్పుల పద్మ, ఐ ఆర్ పి టీచర్ నీరజ షారోన్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు డ్వాక్రా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మటన్ చికెన్ వ్యర్థల కంపు

**ఎక్కడ లేని మటన్ ధర కేజీ 1000/- రూపాయలు ఎందుకు?**

**వార్తకు స్పందించిన అధికారులు**

**గొర్రెలు మేకలు కలేభలోనే కట్ చెయ్యాలనే ఆదేశాలు జారీ చేసిన అధికారులు**




**తొలి సమయం మహబూబాబాద్ జనవరి 25:** ఇటీవల వల మానుకోట మున్సిపాలిటీ లో మటన్ చికెన్ వ్యర్థల కంపు అనే కధనం కు మున్సిపాలిటీ అధికారులు స్పందించారు వెంటనే మటన్ చికెన్ షాప్ లకు నోటీసు లిచ్చారు. మేకలు గొర్రెలు షాప్ లలో కోయరాదు, కలేబా వద్దనే కట్ చెయ్యాలని, వాటి నాణ్యత లేదా ఆరోగ్యత పై సర్టిఫికెట్ లేదా టాగ్ వేసి రషీద్ తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులు నోటీసు లిచ్చారు. ఒకవేళ అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని, ప్రతి షాప్ కు నోటీసు లు ఇచ్చారు..వేచి చూద్దాం రెక్కలు వచ్చిన మటన్ ధర తగ్గుతుందా! లేదా.. వేచి చూద్దాం.

# వీసారెడ్డి రాజకీయం వీడుతున్నారంటే ఆలోచించాలి !

**విజయసాయి రెడ్డి రాజీనామాపై షర్మిల హాట్కామెంట్స్**

**విజయవాడ,జనవరి25:** వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజకీయ సన్యాసంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాట్ కామెంట్స్ చేశారు. జగన్‌ను వీసారెడ్డి వంటి వారే వదిలి వేస్తున్నారంటే ఆలోచన చేయాలని అన్నారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికు ఏం చెప్పకుండా విజయసాయి రెడ్డి రాజీనామా చేయరని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విజయసాయి రెడ్డిపై షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. తన కుటుంబం, తన పిల్లల మీద ఇష్టం వచ్చినట్లుగా విజయసాయిరెడ్డి మాట్లాడారని చెప్పారు. వైసీపీని ఆయన వీడారంటే చిన్న విషయం కాదన్నారు. ఒక్కొక్కరుగా జగన్‌ను వదిలి బయటకు వస్తున్నారని చెప్పారు. జగన్ నాయకుడిగా ఓడిపోయాడు.. విశ్వాసనీయతను కోల్పోయారని వైఎస్ షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకే జగన్ తన అనుకున్నవారంతా వైసీపీ నుంచి వెళ్లిపోతున్నారని అన్నారు. బీజేపీకి, మోదీకి జగన్ దత్త పుత్రుడు అని విమర్శించారు. ఇంతకాలం వీసారెడ్డిని బీజేపీ దగ్గర ఉంచే కేసుల విచారణ సాగకుండా జగన్ చేశారని ఆరోపించారు. ఇప్పుడు విశ్వాసనీయతను జగన్ కోల్పోయారని విమర్శలు చేశారు. విజయసాయి రెడ్డి గతంలో ఎన్నో అబద్దాలు చెప్పారన్నారు. ఇప్పుడైనా అన్ని నిజాలు ఆయన బయట పెట్టాలని చెప్పారు. మాజీ మంత్రి వివేకా కేసులో కూడా జగన్ చెప్పమన్న విధంగా అబద్దాలు చెప్పారన్నారు. వీసా రెడ్డి అన్నీ నిజాలు చెబితే.. ప్రజలు ఇప్పుడైనా హర్షిస్తారని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో చంద్రబాబు, కూటమి నేతలు ప్రచారం ఊదరగొట్టారన్నారు. మీ హామీలపై మీకే నమ్మకం లేకపోతే ఎలా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ అన్నారని... కానీ రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. తల్లికి వందనం పేరుతో ఒక్కో బిడ్డకు రూ.15 వేలు అన్నారని.. కానీ రాష్ట్రంలో ఒక్క బిడ్డకైనా మీరు డబ్బులు ఇచ్చారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పిల్లల ఫీజులు కట్టారని చెప్పారు. మహాశక్తి అన్నారు.. మహిళల బాధ్యత తమది అన్నారని.. కానీ నెలకు రూ.1500 కూడా ఎందుకు ఇవ్వట్లేదని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




**తొలి సమయం ఎల్కతుర్తి, జనవరి 25**

శనివారం రోజునా జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడివో కార్యాలయం ఆవరణలో స్థానిక పాఠశాల విద్యార్థుల తో పాల్గొన్న తహసీల్దార్ జగత్ సింగ్ అనంతరం అయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటును ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకోవాలని, ఓటు దేశ భవిష్యత్తును నిర్మిస్తుందని ,జాతీయ ఓటర్ల దినోత్సవం , ప్రతి సంవత్సరం జనవరి 25 న జరుపుకుంటారు. ఇది భారత ఎన్నికల సంఘం యొక్క పునాదిని గౌరవిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను నొక్కి చెప్పడం లక్ష్యంగా పెట్టుకుంది. 2011 లో స్థాపించబడిన ఈ రోజు పౌరులను, ముఖ్యంగా యువతను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామ్య పాలనకు మూలస్తంభమైన భారతీయ పౌరుల ఓటు హక్కును కూడా ఈ సందర్భంగా జరుపుకుంటారు .ఓటు వేయడం అనేది ప్రతి దేశం యొక్క పౌరుల యొక్క అత్యంత ముఖ్యమైన హక్కు, ఓటింగ్ ద్వారా వారిని ఎన్నుకోవడం ద్వారా తమకు కావలసిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు పౌరులకు లభిస్తుంది. భారత రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ఓటు హక్కు భారతదేశంలో రాజ్యాంగ హక్కు అని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమం లో ఎంపిడివో కార్యాలయసూపరడెంట్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు, సిబ్బంది, అగ్రికల్చర్ అధికారి, మిగతా అధికారులు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపండు చందంగా

# చిత్రపరిశ్రమ !

**హైదరాబాద్ :**

చిత్ర పరిశ్రమ..అది దేశంలో ఏభాషలో అయినా కావచ్చు..ఆడవాళ్లను లొంగదీసుకోకుండా నడిచిన దాఖలాలు లేవు. చిత్రపరిశ్రమలోకి ఉత్సాహంగా వచ్చిన మగువలను మృగాళ్లు..వదలడం లేదు. అక్కడ విలువలు మృగ్యం. మగ పెత్తనమే ఎక్కువ. ఆడవాళ్లంటే నీచాతినీచంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఎన్నో చూశాం. ఓ రకంగా సమాజంలో మగసామ్రాజ్యం ఎక్కడైనా ఉందంటే అది చిత్ర పరిశ్రమ అని చెప్పక తప్పదు. ఇలీవల మాలీవుడ్ అంటే..మళయాలంలో కాస్ట్‌కౌచింగ్ దుమారం రేపింది. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలయ్యింది. అక్కడ జరుగుతున్న దారుణాలు బయటపడ్డాయి. నీతి వాక్యాలు వల్లించే వారి బండారం బయటపడింది. అమ్మ కమిటీకి మోహన్ లాల్ రాజీనామా చేశారు. వాడుకోవడం ...వదిలేయడం చిత్రపరిశ్రమలో షరామూమూలు అన్న ప్రచారం ఉండనే ఉంది. ఈ క్రమంలో వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం విధిలేని పరిస్థితిలో కార్యాచరణకు పూనుకుంది. ఇదే క్రమంలో నటీమణులు ఒక్కొక్కరుగా తమకు జరిగిన అనుభవాలను, బాధలను బయటపెడుతున్నారు. నిజానికి ఆడవాళ్లు ధైర్యం చేసి చిత్రపరిశ్రమలోకి రాకుంటే...విర్రవీగుతున్న మగాళ్లు ఏమవుతారు. ఆడవేశాలు కూడా వారే వేసుకుంటారా అన్నది ఆలోచన చేయాలి. స్త్రీలు భీష్మించుకుని చిత్రరంగంలోకి రాకుంటే ..డ్రామా కంపెనీల్లాగా చిత్రపరిశరమ దుర్గతిని ఎదుర్కోక తప్పదు. నీతి వాక్యాలు వల్లిచే హీరోలు, నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచన చేయాలి. చిత్రపరిశ్రమను ఆదర్శం గా నిలపడానికి కృషి చేయాలి. పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్న..కుక్కతోక వంకర అన్న చందంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడటంల్లేదు. వారిని తోటివారుగా గౌరవించడం లేదు. ఇలా తమిళనాడు, బాలీవుడ్, ఒక్కటేమిటి అన్ని భాషల్లోనూ చిత్రపరిశ్రమలోకి రావాలనుకున్న...వచ్చిన మహిళలు వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నారు. నిజానికి పనిప్రదేశాల్లో అన్ని చోట్లా ఇదే దుస్థితి ఉంది. కాకపోతే చిత్రపరిశ్రమలో కాస్తా ఎక్కువగా ఉంటుందని చర్చించుకోవాల్సి వస్తోంది. తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ జానీ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించింది. అయ్యో జానీ మాస్టార్ అంటూ నీతులు వల్లిస్తున్నారు. ఆ అమ్మాయి సొంతంగా బతుకీదుద్దామనుకుంటున్న తరుణంలో కూడా వేధింపులకు పాల్పడ్డ జానీ తీరును ఖచ్చితంగా ఎండగట్టాల్సిందే. ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే ..ఎందుకు ఫిర్యాదు చేసింది..ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు అంటూ నస పెడుతున్న వారు నిజాలు ఆలోచన చేయాలి. ఇటువంటి వాదనలతో నిజాలను పక్కదారి పట్టించలేరు. సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి.

## ఆదివాసీల మనుగడకై సాగే పోరాటంలో భాగమే

# “చిరుమళ్ల సమ్మక్క సారక్క మహా జాతర”

**ఈ జాతర ద్వారా రాష్ట్రానికి, దేశానికి నిజమైన ఆదివాసీలు అంటే ఎవరో తెలుస్తుంది.**

**ప్రజాపోరాటం, న్యాయపోరాటం రాజకీయపోరాటాలతో పాటుగా ఆదివాసీల సాంస్కృతిక పోరాటంతో ఆదివాసీల ఐక్యత , అభివృద్ధి సాధ్యమవుతుంది.**

**ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త, కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ**

**ఈ నెల జనవరి 26 నుండి ఫిబ్రవరి 15 వరకు భద్రాద్రికొత్త గూడెం జిల్లా, కరకగూడెం మండలం, చిరుమళ్ళ గ్రామంలో సమ్మక్క సారక్క మహా జాతర 21 రోజుల ఉపవాస దీక్షలు జరుగనున్న సందర్భంగా తలపెట్టిన సమీక్షా సమావేశంలో కోయ పున్నెం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలుగా 9 ఆదివాసీ తెగలు తమ రాజ్యాంగ హక్కుల కోసం, తమ రిజర్వేషన్లు కొల్లగొడుతున్న వలస అక్రమ గిరిజనులపై ప్రజాపోరాటం, న్యాయపోరాటం, రాజకీయ పోరాటం చేస్తున్న విషయం అందరికి తెలిసిందే అన్నారు.**

**తొలి సమయం భద్రాద్రి కొత్త గూడెం జనవరి 25:** ఈ నెల జనవరి 26 నుండి ఫిబ్రవరి 15 వరకు భద్రాద్రికొత్త గూడెం జిల్లా, కరకగూడెం మండలం, చిరుమళ్ళ గ్రామంలో సమ్మక్క సారక్క మహా జాతర 21 రోజుల ఉపవాస దీక్షలు జరుగనున్న సందర్భంగా తలపెట్టిన సమీక్షా సమావేశంలో కోయ పున్నెం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలుగా 9 ఆదివాసీ తెగలు తమ రాజ్యాంగ హక్కుల కోసం, తమ రిజర్వేషన్లు కొల్లగొడుతున్న వలస అక్రమ గిరిజనులపై ప్రజాపోరాటం, న్యాయపోరాటం, రాజకీయ పోరాటం చేస్తున్న విషయం అందరికి తెలిసిందే అన్నారు. వీటితో పాటు ఈ దేశ మూలవాసులైన ఆదివాసీ తెగలుగా గుర్తించబడిన కోయత్తూరు ప్రజల సంస్కృతిని పునరుద్ధరించడం ద్వారానే జాతి అభివృద్ధితో పాటు ,జాతి అస్తిత్వం కాపాడబడు తుందని ఆలోచించాము అన్నారు. కోయ సంస్కృతి మరియు ఇంటివేల్పుల చారిత్రిక ఆధారాలు తెలిసిన పెద్దలు చందా వీరయ్య చిరుమళ్ళ, తాటి వెంకటేశ్వర్లు తుమ్మల చెరువు, తోలెం నాగయ్య దేవానగరం, వేప భూమయ్య మడగూడెం,నాగుల శ్రీరాములు చింతూరు లాంటి వారి సమాచారం, సహకారంతో 4 దశాబ్దాల క్రితం ఆగిపోయిన చారిత్రిక నేపథ్యమున్న చిరుమళ్ళ గ్రామంలోని విప్ప చెట్టు ( పెద్దల ఊహకు తెలిసి 100 ఏళ్ల పైబడి) కింద సమ్మక్క తల్లి పూజలు అందుకునేది అన్నారు అదేవిధంగా, నేటి మేడారం జాతర ప్రదేశానికి ముందే చందా వంశస్థుల ఆధ్వర్యంలో బయ్యక్కపేటలో సమ్మక్క తల్లి జాతరను రెండేళ్లకో మారి నిర్వహించిన చరిత్ర వుందన్నారు . ప్రతి ఏడు ఒక్క చోట మాత్రమే నిర్వహించుకునే ఒప్పందం కూడా చిరుమళ్ళ, బయ్యక్కపేట చందా వంశస్థులు చేసుకున్నారని మాజీ ఎంఎల్ఏ చందా లింగయ్య దొర అన్నారు. ఈ విషయం బహుశా నేటి పాలకులకు కానీ, సమాజానికి కానీ తెలియక పోవచ్చు అన్నారు. అటువంటి సందర్భంలో జాతి అస్తిత్వం కోసం, జాతి ప్రయోజనాల కోసం, జాతిని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఐక్యం చేయాలనే ఉద్దేశ్యంతో జాతి మూలాల్ని పరిశోధించి వాటిని నేటి తరంతో పాటు, సమాజానికి, పాలకులకు తెలియచేయడం ద్వారా ఈ రాష్ట్రంలోని నిజమైన ఆదివాసీ తెగలు ఎవరో యావత్ రాష్ట్రానికే కాదు దేశంలోని అన్ని వర్గాలకు ,పాలకులకు తెలుస్తుందని అంటున్నారు . ఉన్నత చదువులతో, ఉన్నత ఉద్యోగం చేస్తూ కూడా తను పుట్టిన జాతి సంస్కృతి పరిరక్షణ కోసం, ఇంటివేల్పుల పునరుద్ధరణ కోసం గడచిన 5 సంవత్సరాలుగా 2020 సం”లో బయ్యక్కపేటలో సమ్మక్క తల్లి దీక్షలు ప్రారంభించాం అన్నారు. తరువాత చిరుమళ్ళ క్షేత్రం చారిత్రిక నేపథ్యం గురించి చందా వంశస్థుల నుండి తెలుసుకుని, 2021 సం” నుండి సమ్మక్క దీక్షలను ప్రతి సంవత్సరం మరికొంత మంది భక్తుల మాలధారణతో 21 రోజుల దీక్షలను కొనసాగిస్తూ, చిరుమళ్ల నుండి దాదాపు 10 కిలోమీటర్ల దూరంలోని అడవిలోని ఎత్తైన కొండ మీది గుహలో కొలువై ఉండే సమ్మక్క తల్లి బండారి , వెదురు వనాన్ని ఆదివాసీ ఆచారాల ప్రకారం పూజలు చేసి , గ్రామ సరిహద్దులోని విప్ప చెట్టు కింద గద్దెలకు చేర్చి భక్తులకు దర్శనం చేసుకునే అవకాశంతో పాటు, అదే రోజు అర్ధరాత్రి 12గం” ల తరువాత పగిడిద్దరాజుతో కళ్యాణం రెండేళ్లకో మారు చిరుమళ్ళలో చేయడం జరుగుతుంది అన్నారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ 2023 సం”లో జాతర నిర్వహణతో పాటు తొలిసారిగా కోయతూర్ తెగ సంస్కృతిలో భాగమైన, ఇంటి వేల్పుల పడగ గుడ్డలతో వచ్చిన తలపతులు, వడ్డేలు (పూజారులు), ఆ వేల్పు వంశస్థులు, వేలాది మంది



భక్తులతో మూడు రోజుల పాటు 124 వేల్పుల మహా సమ్మేళనం విజయవంతంగా నిర్వహించడం జరిగింది అన్నారు. ఇది ఈ కాలంలో జరిగిన అతిపెద్ద సమ్మేళనం. గత మేడారం జాతరలో కూడా 50 కంటే తక్కువ వేల్పుల సమ్మేళనం జరిగింది అన్నారు. గత జాతర ఎవరూ ఊహించనంత విజయవంతం అయినప్పటికీ ఆర్థికంగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ సహకారం లేకపోవడంతో తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఛత్తీస్గఢ్, ఒడిస్సా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జాతరకు వేల్పులను తరలించిన వాటివంశస్థులు, పూజారులు, ఆడ్తి డోలు కళాకారులు ఆర్థికంగా ఇబ్బంది పడటం జరిగింది అన్నారు. ఇటువంటి అతి గొప్ప ఆదివాసీ తెగ కోయాత్తూరు ఇంటి వేల్పుల సమ్మేళనం మరియు సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణం ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి పత్రాలు ఇప్పటికే ఇచ్చాం అన్నారు . త్వరలో కోయ తెగ పెద్దలతో గౌరవ గవర్నర్, ముఖ్యమంత్రి గారితో పాటు కేంద్ర మంత్రులను కలిసి ప్రభుత్వ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేస్తామని, ఇంకా ఈ జాతర ను భలోపేతం చేయడానికి అన్ని రాష్ట్రాల పెద్దలతో కలిసి జాతి సంస్కృతి పరిరక్షణ కోసం “ ఆదివాసీ ధార్మిక పరిషత్ “ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తామని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.




TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101